
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 26.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 16 జూలై 2024


ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో దగ్ధమౌతున్న ఆర్టీసీ బస్సు

జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి టీ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాద నమూనా చిత్రం



డెత్ స్పాట్

- ప్రమాదాలకు నిలయంగా బురెడ్డిపల్లి టీ జంక్షన్
- వాహనాలు రోడ్డు దాటుతుండగా యాక్సిడెంట్లు
- అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలంటున్న స్థానికులు


ప్రమాదాలకు కేంద్రంగా మారిన జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి టీ జంక్షన్

జడ్చర్ల, జూలై 15: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న బురెడ్డిపల్లి టీ జంక్షన్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ తరచూ జరుగుతున్న యాక్సిడెంట్లలో ఎందరో మరణిస్తున్నారు. బురెడ్డిపల్లి నుంచి జడ్చర్ల కొత్తబస్టాండు వైపు, అలాగే జాతీయ రహదారి నుంచి బురెడ్డిపల్లివైపు వచ్చే సందర్భంలో జాతీయ రహదారి దాటుతుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడ్డారు. మరెందరో గాయపడ్డారు. జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వస్తుండటం, రోడ్డు దాటుతున్న వారు అప్రమత్తంగా వ్యవహరించకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి.

తప్పిన ప్రాణనష్టం

తాజాగా ఆదివారం అర్ధరాత్రి ఇదే బురెడ్డిపల్లి టీ జంక్షన్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్న డీసీఎంను హైదరాబాద్ నుంచి ధర్మవరం వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో బస్సు డీసీఎంను ఢీకొంటూ అవతలి వైపు రోడ్డు కిందకు వెళ్లిపోయింది. ఆ సమయంలో బస్సులో 36 మంది ప్రయాణీకులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. బస్సు ఇంజన్‌లోంచి పొగలు రావడంతో అప్రమత్తం అయిన ప్రయాణికులు బస్సు అత్యవసర ద్వారంతో పాటు కిటికీల్లో నుంచి కిందకు దిగారు. ఈ ఘటనలో డ్రైవర్‌తో సహా 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బస్సు స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను స్థానికులు, ప్రయాణికులు కష్టపడి బయటికి దించారు. తర్వాత ఇంజన్‌లో నుంచి మంటలు వచ్చి, బస్సు మొత్తం దగ్ధమైంది. ప్రయాణికులు ముందే దిగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సు స్థానంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఉంటే ప్రమాద తీవ్రత మరోలా ఉండేదని చర్చ జరుగుతోంది. ఎయిర్ కండిషన్‌తో నడిచే ఆ బస్సులకు అత్యవసర ద్వారం ఉన్నా.. కిటికీ అద్దాలను పగులగొట్టేందుకు ప్రయాణికులు శ్రమించాల్సి వచ్చేదని, ఆలోగా మంటలు వ్యాపించి ప్రయాణికులు మృతి చెందేవారని చర్చించుకుంటున్నారు.

బ్లాక్ స్పాట్‌గా గుర్తింపు

వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో బురెడ్డిపల్లి టీ జంక్షన్‌ను పోలీసులు ఈ నెల 12న బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రోడ్డు భద్రత శాఖ డీఎస్పీ సుదర్శన్, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌లు పరిశీలించారు. జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాల్సిన అవశ్యకత ఉందని గుర్తించారు. ప్రమాదాలను నివారించేందుకు జంక్షన్ మూసివేయాలనే ప్రతిపాదనను పరిశీలించేందుకు ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అండర్‌పాస్ నిర్మాణానికి డిమాండ్

బురెడ్డిపల్లి టీ జంక్షన్ వద్ద ఫ్లై అండర్‌పాస్ నిర్మించాలన్న స్థానికుల డిమాండ్ నెరవేరడం లేదు. ఈ జంక్షన్ వద్ద తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అండర్‌పాస్ నిర్మిస్తే ప్రమాదాలు జరుగవని ఇప్పటికే పలు పర్యాయాలు ప్రజాప్రతినిధులను, అధికారులను స్థానికులు కోరారు. జాతీయ రహదారి కావడంతో అండర్‌పాస్ నిర్మాణం కోసం ఎన్‌హెచ్‌ఐఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు.



ప్రమాదంలో దగ్ధమైన బస్సు

గతంలో జరిగిన ఘటనలు

- నాగర్‌కర్నూల్ జిల్లా నేరెళ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీను(40) బురెడ్డిపల్లి టీ జంక్షన్ వద్ద ఈ నెల 10న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీ కొట్టింది. శ్రీను కడుపుపై వాహనం టైర్లు ఎక్కడంతో పొట్ట పగిలి, అవయవాలు బయటపడ్డాయి. అతన్ని చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు.
- జడ్చర్ల మునిసిపాలిటీలోని పాతబజారుకు చెందిన ఆంజనేయులు(50) గత నెల 27న జడ్చర్ల కొత్తబస్టాండు సమీపంలోని ఓ హోటల్ భోజనం చేశాడు. తిరిగి ఇంటికి బురెడ్డిపల్లి టీ జంక్షన్ మీదుగా వెళ్తుండగా, ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడే మృతి చెందాడు.
- హరితహారంలో భాగంగా ఏడాదిన్నర కిందట జాతీయ రహదారిపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో జాతీయ రహదారి వద్దకు తెచ్చారు. జంక్షన్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను కంటైనర్ ఢీ కొట్టడంతో జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన ఆరుగురు మృతి చెందారు.


అండర్ పాస్ నిర్మించాలంటూ ఆందోళన చేస్తున్న స్థానికులు(ఫైల్)

జీవోలే కాదు..
పనులూ చేస్తాం

- టెండర్లు పూర్తయిన తర్వాతే శంకుస్థాపనలు చేయడమే మా విధానం
- వెనుకబడిన మహబూబ్‌నగర్- నల్గొండ జిల్లాలను అభివృద్ధి చేస్తాం
- బైపాస్‌తో జడ్చర్ల, భూత్పూరు, పాలమూరు ట్రైసిటీలుగా అభివృద్ధి
- పీయూలో ఉద్యోగాల భర్తీ, వైస్ ఛాన్సలర్ కూడా త్వరలో నియామకం
- జడ్చర్ల పర్యటనలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జడ్చర్లలో రూ.133 కోట్లతో రోడ్లకు శ్రీకారం చుట్టి, పనులు ప్రారంభం


బాలానగర్ నుంచి గంగపూర్ వరకు డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు; చిత్రంలో ఎంపీ అరుణ, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జీఎంఆర్

మహబూబ్‌నగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జీవోలు కావాలంటే ఎన్నైనా ఇవ్వొచ్చని, జీవోలు ఇవ్వడమే కాదు, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తూ శంకుస్థాపనలు చేయడమే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ విధానమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలో రూ. 133 కోట్లతో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఆయన జడ్చర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జడ్చర్లలో పనులను కూడా మిషన్లు దించిన తర్వాతే ప్రారంభించామని చెప్పారు. త్వరలో దేవరకద్ర నియోజకవర్గంలో రూ. 150 కోట్లతో చేపట్టబోయే పనులకు కూడా ఇదేవిధానం అమలు చేస్తామన్నారు. వెనుకబాటులో ఉన్న పాలమూరు- నల్గొండ జిల్లాలను అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కృషి చేస్తున్నామని చెప్పారు. రీజనల్ రింగ్‌రోడ్డుకు 20 కిలోమీటర్ల దూరంలోనే జడ్చర్ల ఉన్నదని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు చాలా అవకాశాలున్నాయన్నారు. మహబూబ్‌నగర్, భూత్పూరు, జడ్చర్ల బైపాస్ ద్వారా ట్రై సిటీలుగా మారతాయని అన్నారు. పీయూలో ఉద్యోగాలను భర్తీ చేస్తామని, త్వరలో వీసీ నియామకం పూర్తవుతుందని అన్నారు. హైదరాబాద్- బెంగళూరు హైవేను గ్రీన్ ఫీల్డ్‌గా మార్చి 12 లైన్లుగా విస్తరించబోతున్నామని, దీనికి సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధం అవుతోందన్నారు.

త్వరలో ఇందిరమ్మ ఇళ్లకు నిధులు

త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షలు ఇచ్చి పేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఆలోచన చేయలేదని, తాము స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కేటీఆర్ విదేశాలు తిరిగి వచ్చి ఇక్కడ అభివృద్ధి చేశామంటున్నారని, కానీ ఆ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేసిన పనులే కారణమన్నారు. త్వరలోనే రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం ప్రారంభవుతుందని, దానికి చేరువలో ఉన్న పాలమూరు జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక ఎన్నికల్లో జిల్లా పరిషత్ ఛైర్మన్లు, హైదరాబాద్ మేయర్‌తో సహా కాంగ్రెస్ గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కే పాలించే హక్కు ఉన్నదన్నారు. మహబూబ్‌నగర్ స్కిల్ సెంటర్‌కు రూ. 10 కోట్లు ఇచ్చామని, అవసరమైతే మరో రూ. 10 కోట్లు ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్ విమర్శలు చేస్తుంటే ప్రజలు పదేళ్లు ఏం చేశారని నవ్వుకుంటున్నారని అన్నారు. జడ్చర్లలో ఆసుపత్రి కట్టి సిబ్బందిని నియమించకపోతే తాళం వేసి ఉన్నదని, తాను కమిషనర్ కర్ణన్‌తో మాట్లాడానని, 15 రోజుల్లో డాక్టర్లు, సిబ్బంది నియామకం పూర్తయి, ఆసుపత్రి ప్రారంభవుతుందని చెప్పారు.

సంకల్పం ఉంటే నిధులు వస్తాయి : యెన్నం

రోడ్లు, భవనాల విషయంలో మహబూబ్‌నగర్ అభివృద్ధిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకరిస్తున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి మంత్రిగా పనిచేశారని, కోరిన వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. జిల్లాకు ప్రతినెలా వచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న జాతీయ రహదారిని 12 లేన్లుగా, శ్రీశైలం దారిని ఆరు లేన్లుగా, రాయిచూర్ రహదారిని గ్రీన్‌ఫీల్డ్‌గా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. ఆర్‌ఓబీ అవసరమని అడిగితే వెంటనే నిధులు మంజూరు చేశారని చెప్పారు. సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు.


మంత్రులకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

8 నెలల్లో రూ. 133 కోట్లు నిధులు : అనిరుధ్‌రెడ్డి

మూడేళ్ల క్రితం రోడ్ల కోసం పాదయాత్ర చేస్తుంటే గత పాలకులు నవ్వారని, జీవోలు తెచ్చారు కానీ రోడ్లు వేయలేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. తాము ఎనిమిది నెలల్లోనే రూ. 133 కోట్లు తీసుకువచ్చామని, పదేళ్లలో బీఆర్‌ఎస్ రూ. 120 కోట్లు ఇచ్చిందన్నారు. 100 పడకల ఆస్పత్రి అని చెప్పి 30 పడకల ఆస్పత్రి కట్టారని, అందులో ఫర్నిచర్, వైద్యులు లేరన్నారు. అభివృద్ధిలో జడ్చర్లను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దమే లక్ష్యమన్నారు. ఇప్పటికే ఐదు సబ్ స్టేషన్లను మంజూరు చేశామని, జడ్చర్ల, కల్లూరు వద్ద 133 కేవీ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జడ్చర్ల బైపాస్ కోసం డీపీఆర్‌కు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

ముసుగేసిన
ముసురు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం


వనపర్తిలో ముసురు వానకు గొడుగులు పట్టుకొని వెళ్తున్న మహిళలు


వనపర్తిలో వర్షానికి రెయిన్ కోటు వేసుకొని వెళ్తున్న యువకుడు


మహబూబ్‌నగర్‌లో బైక్‌పై తువ్వాల కప్పుకొని వెళ్తున్న వ్యక్తులు

మహబూబ్‌నగర్/నారాయణపేట/ఊట్కూర్/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, జూలై 15 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో సోమవారం రోజంతా ముసురువాన కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వాతావరణం మేఘావృతమై సన్న ముసురు కురిసింది. విడవకుండా వాన కురుస్తుండటంతో జనజీవనం స్తంభించిపోయింది. ముసురుకు రహదారులన్నీ చిత్తడిగా మారాయి. గ్రామాలలో రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా మారాయి. వానాకాలంలో సాగుచేసిన వర్షధార పంటలైన పత్తి, కంది, పెసర పంటలకు ఊరట లభించింది. నారాయణపేటలోని జిల్లా అసుపత్రి రోడ్డు గుంతల్లో వర్షం నీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు.

- మహబూబ్‌నగర్‌లో ఆదివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు 16 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.
- వనపర్తి జిల్లా అమరచింత మండలంలో 58.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 38.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.
- నారాయణపేట జిల్లాలోని నర్వ మండలంలో 53.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మరికల్ మండలంలో 23.8, దామరగిద్ద మండలంలో 50.4, మక్తల్ మండలంలో 47.6, కోస్గి మండలంలో 42.8, క్రిష్ణ మండలంలో 40.2, నారాయణపేట మండలంలో 37.8 వర్షపాతం నమోదైంది.
- జోగుళాంబ గద్వాల గద్వాల, ధరూర్‌లలో నాలుగు సెంటీ మీటర్ల వర్షం కురవగా, కేటీదొడ్డి, ఇటిక్యాల మల్దకల్‌లలో మూడు సెంటీ మీటర్లు కురిసింది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 13.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కోడేరు మండలంలో 43.8, లింగాలలో 42.4, కొల్లాపూర్‌లో 37.8, పెంట్లవెల్లిలో 20.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కూలిన ఇల్లు

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఊట్కూర్ మండల కేంద్రంలోని పాతపేట వీధికి చెందిన సందుల నరసింహా ఇల్లు కూలింది. ఇంట్లో ఉన్న బియ్యం, జొన్నలు, పప్పు, దుస్తులు సైతం మట్టి పాలయ్యాయి. బీరువా పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రూ.20 వేల నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.


ఊట్కూర్‌లో ఇంటి పైకప్పుకూలి, కిందపడ్డ మట్టి


ఆత్మకూరులో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి ఇవ్వాలి

- ఫారెస్ట్ కార్యాలయం ముందు హిందూ సంఘాల నిరసన


ఫారెస్ట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అచ్చంపేట, జూలై 15: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లమలలో వెలసిన లొద్ది మల్లయ్య క్షేత్రాన్ని అనాదికాలం నుంచి భక్తులు దర్శించుకుంటూ వస్తున్నారు. గత నాలుగేళ్లుగా అటవీ అధికారులు ఏకాదశి రోజున లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతులు లేవంటూ నిరాకరిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో గతంలోలేని నిబంధనలు ఇప్పుడు ఎలా వచ్చాయంటూ లొద్ది మల్లయ్య క్షేత్రానికి అనుమతులు ఇవ్వాలంటూ సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద బీజేపీ, బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ తదితర హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం వెళ్లే యాత్రికులను, అలాగే నల్లమల ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి చెందిన మల్లెల తీర్థం, సలేశ్వరం, లోద్దిమల్లయ్య, మద్దిమడుగు, ఉమామహేశ్వరం క్షేత్రాలకు వెళ్లే మార్గంలో చెక్‌పోస్టులు పెట్టి యాత్రికల దగ్గర నుంచి పన్నులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దేవాలయాలకు వెళ్లే భక్తులపై లేనిపోని జీవోలు తీసుకువచ్చి ఇబ్బందులకు గురిచేయ వద్దన్నారు. ఏకాదశి పర్వదినం రోజు లొద్ది దర్శనం కల్పించాలని, లేకుంటే భక్తులు వెళ్లి దర్శించుకొని తీరుతారన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు మండీకారి బాలాజీ. నాయకులు శివచంద్ర, నరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం..
రాస్తారోకో

- అమరచింతలో బిందెలు పట్టుకొని రోడ్డెక్కిన మహిళలు
- నాలుగు నెలలుగా ఎద్దడి నెలకొన్నదని ఆవేదన
- మూడు గంటల పాటు స్తంభించిన వాహనాల రాకపోకలు


అమరచింతలో రాస్తారోకో చేస్తున్న పట్టణవాసులు

అమరచింత, జూలై 15: ఒక వర్షాలు కురుస్తుండగా.. మరో వైపు ఖాళీ బిందెలతో తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింతలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణంలోని ఆరు, ఏడో వార్డుల్లో గల పలు ప్రాంతాల్లో నాలుగు నెలలుగా తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు, ఆయా కాలనీలవాసులు ఆత్మకూరు-మరికల్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. వారికి పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తాగునీటి ఎద్దడిని తీర్చాలని నాలుగు నెలలుగా మునిసిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఒకవైపు వర్షాలు పడుతున్నా తమ కాలనీకి గుక్కెడు నీళ్లు రావడం లేదన్నారు. మునిసిపల్ అధికారులు వచ్చి హామీ ఇచ్చే వరకు రాస్తారోకో విరమించబోమని భీష్మించారు. దాంతో దాదాపు మూడు గంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు వచ్చి నచ్చజెప్పినా విరమించ లేదు. దాంతో పోలీసులు మునిసిపల్ అధికారులను అక్కడికి రప్పించారు. మునిసిపల్ అధికారి కృష్ణయ్యను కాలనీలవాసులు చుట్టుముట్టి, వాగ్వాదానికి దిగారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తామని, అప్పటి వరకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీలవాసులు మణెమ్మ, రాధ, ఎల్ఐసి రాజన్న, అజయ్, బీసీ దామోదర్, మక్బుల్, తెలుగు రమేష్, కురువ రఘు, రామలింగం, మేస్త్రీ రామకృష్ణ, శ్రీను, క్యామ నాగేష్, శ్రీకాంత్, బద్రి, శ్రీను, వీరేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివలింగానికి లక్ష బిల్వార్చన

- 201మంది దంపతులతో మృత్యుంజయ హోమాలు



శివ లింగానికి లక్ష బిల్వార్చన చేస్తున్న పీఠాధిపతి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 15: శ్రీకృష్ణ కాలచక్రం 83వ విశ్వశాంతి మహాయాగంలో భాగంగా సోమవారం మట్టితో తయారు చేసిన దశ సహస్ర (పదివేలు) శివ లింగాలకు పంచామృత అర్చన, లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాగ నిర్వాహ కులు పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి ఉదయం గోపూజ అనంతరం శివుడికి రుద్రాభి షేకం చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన సామూహిక కుంకుమా ర్చన మహిళా భక్తులు పాల్గొని విష్ణు సహస్ర, లలితా సహస్ర నామ పారా యణం చేశారు. నిత్య హోమాల్లో భాగంగా సోమవారం 201 మంది దంపతులతో అమృత పాశుపత మృత్యుంజయ, రుద్ర హోమాలు చేశారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి శివలింగానికి లక్ష బిల్వా ర్చన అనంతరం దశ సహస్ర లింగార్చన చేశారు. పూజ కార్యక్ర మాల్లో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీర్వాదం తీసుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. నేడు ఉదయం సర్పసూక్త సహిత సంతాన గోపాల హోమాలు, మన్యుసూక్త హోమాలు, సుబ్ర హ్మణ్య హోమాలు చేయనుండగా సాయంత్రం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మా ణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

బస్సు సర్వీస్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే



నర్వ మండలం నాగిరెడ్డిపల్లెలో బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్/నర్వ, జూలై 15 : మక్తల్ నియోజకవర్గం ఊట్కూర్ మండలంలోని ఓబ్లాపూర్, పగిడిమారి గ్రామాలకు వెళ్లేందుకు సోమవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మక్తల్ నుంచి బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊట్కూర్ మండలంలోని ఓబ్లాపూర్, పగిడిమారి గ్రామాల నుంచి మక్తల్, నారాయణపేటకు వచ్చిపోయేందుకు విద్యార్థులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఈ విషయం తన దృష్టికి రావ డంతో పేట డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు సర్వీస్‌ను ప్రారంభిం చినట్లు తెలిపారు. ఉదయం 7.15గంటలకు మక్తల్ నుంచి బయలు దేరి ఓబ్లాపూర్ మీదుగా నారాయణపేటకు 8.10గంటలకు చేరుకుం టుంది. సాయంత్రం 4.50గంటలకు బయలుదేరి వయా ఓబ్లాపూర్ మీదుగా జక్లేర్‌కు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ లక్ష్మీసుధ, అసిస్టెంట్ మేనేజర్ అలివేలు, ఎంఎఫ్ చంద్ర నాయక్, కాంగ్రెస్ నాయకులు గణేష్‌కుమార్, లక్ష్మారెడ్డి, ఎల్కోటి నారాయణరెడ్డి, కల్లూరిగోవర్ధన్, గద్వాల రవికుమార్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే వనపర్తి డిపోకు చెందిన ఆత్మకూర్ టు నర్వ ఆర్టీసీ బస్సును సోమవారం నర్వ మండలం నాగిరెడ్డిపల్లెలో ఎమ్మె ల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద మొక్కలను నాటారు. అనంతరం నాగిరెడ్డి పల్లె నుంచి, యాంకి గ్రామం వరకు బస్సును డ్రైవర్ అనుమతితో ఎమ్మెల్యే నడిపారు. రా యికోడ్, నర్వ , వనపర్తి వరకు ఈ బస్సు రోజు ఉదయం, సాయం త్రం విద్యార్థుల పాఠశాలల సమయంలో తిరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శర ణప్ప, వివేక్ వర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సిరాజ్, బీసం రవికుమార్ అయ్యప్ప రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్‌కు తరలిస్తున్న పౌర సరఫరాల అధికారులు

వనపర్తి రూరల్, జూలై 15: వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో దాదాపు 55 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పౌర సరఫరా అధికారులు పట్టుకున్నారు. కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన చిలిమర్తి ఎరుకలి కురుమూర్తి పెద్దగూడెం గ్రామంలోని బోయ కురుమయ్య ఇంటిని అద్దెకు తీసుకుని ఇంట్లో దాదాపు 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం దాచి పెట్టాడు. రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డికి పక్కా సమాచారం వచ్చింది. దాంతో పోలీసులు తనిఖీ చేసి గుర్తించారు. పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు రేషన్ బియ్యంగా గుర్తించి ఆర్ఐ పంచనామా నిమిత్తం మండల లెవెల్ స్టోరేజీకి తరలించారు. రేషన్ బియ్యాన్ని దాచి ఉంచిన కురుమూర్తిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

కారు డ్రైవర్ పై కేసు నమోదు

ఉప్పునుంతల, జూలై15 : బైక్‌ను ఢీకొన్న కారు డ్రైవర్‌పై సోమవారం కేసు నమోదు అయింది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన చెన్నిరెడ్డి యాదిరెడ్డి వారి బంధువు చీమర్ల రామిరెడ్డి ఇద్దరు కలిసి తన బైక్‌పై ఏప్రిల్ 25న నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రానికి వెళ్లి తన స్వగ్రామం అయ్యవారిపల్లి గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యారు. అచ్చంపేట నుంచి డిండి వైపు వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణ జిల్లాలోని పోనంకి గ్రామానికి చెందిన డ్రైవర్ కృష్ణచైతన్య కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నది. బైక్ పై ఉన్న యాదిరెడ్డి తో పాటు తన బంధువు చీమర్ల రామిరెడ్డి తలకు రక్త గాయాలయ్యాయి. సోమవారం యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నయోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ

అచ్చంపేటటౌన్, జూలై 15: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. టీచర్స్ కాలనీ కి చెందిన ఏనుపోతుల రాఘమయ్య ఇంటికి తాళం వేసి ఊరికి వె ళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు. సో మవారం ఇంటికి వచ్చే వరకు బీరువాలోని బట్టలు, వస్తువులు చిం దవందరగా పడి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని పోలీ సులకు సమాచారం అందించారు. ఆభరణాల విలువ సుమారు రూ. లక్ష వరకు ఉన్నట్లు బాధితుడు రాఘవయ్య ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు గద్వాల విద్యార్థి

గద్వాల అర్బన్, జూలై 15 : గద్వాల పట్టణానికి విద్యార్థి రిషి రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని కోచ్ డి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహిం చిన ఇంటర్ డిస్ట్రిక్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న రిషి బాలుర విభాగంలో చాంపియన్ షిప్ దక్కించుకొని, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

బీబీ ఫాతీమా దర్శనానికి బారులు

- కనువిందు చేసిన పీర్ల సవార్లు
- గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు



బీబీ ఫాతీమా అలం వద్ద భక్తుల రద్దీ

కోయిలకొండ, జూలై 15 : బీబీ ఫాతీమా మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీబీ ఫాతీమా దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఖిల్లాలోని పెద్దగొని నుంచి బీబీ పాతీమా దర్శనం కోసం బారులు తీరారు. జన రద్దీ పెరగడంతో అందకు తగ్గట్టుగా స్థానిక ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు. వర్షాన్ని లెక్క చేయకుండా భక్తులు బీబీ ఫాతీమాకు కందూర్లు నిర్వహిం చి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాగు నీటి వసతితో పాటు పారిశుధ్య పనులు చేపట్టారు. సోమవారం ఇమాం ఖాసీం, అంకిళ్ల పీర్ల స వార్లు కనువిందు చేశారు. మం డల కేంద్రం నుంచి ఖిల్లాపై వరకు పీర్ల ఊరేగింపు నిర్వహించారు.

కెనాల్స్ తవ్వకాల కోసం సర్వే

- నెరవేరనున్న అటవీ తీర గ్రామ రైతాంగం కల



కాల్వల సర్వేకు వచ్చిన సిబ్బంది

పెద్దకొత్తపల్లి, జూలై 15 : సాగునీటి సౌకర్యం లేక కేవలం వర్షాధారం మీద ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్న నల్లమల తీర గ్రామ రైతాంగం కల సాకారం కాబోతుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు ఇటీవల చొరవ తీసుకుని సాగు నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో బీడు భూములకు ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీరందించడం కోసం కెనాల్స్ తవ్వకాల కోసం నీటిపారుదల శాఖ అధికారులు మారేడుమానుదిన్నె గ్రామ శివారులో సోమవారం సర్వేకు శ్రీకారం చుట్టారు. మెయిన్ కెనాల్స్, సబ్ కెనాల్స్ తవ్వకాలు ప్రక్రియ పూర్తైతే అటవీ తీర ప్రాంతాల్లోని సుమారు నాలుగు వేల ఎకరాల బీడు భూములకు సాగునీరందనుందని రైతులు భావిస్తు న్నారు. సర్వే కోసం వచ్చిన నీటిపారుదల శాఖ అధికారులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. తమ పొలాలకు సాగునీరు అందనున్నదని అటవీ తీర ప్రాంతాల రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్దకొత్తపల్లి మండలంలోని మారుమూల గ్రామాల రైతులు సాగునీటి విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మేకల గౌరమ్మ, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు నివేదికలు సమర్పించిన కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి సర్వే చేయించడం హర్షనీయమన్నారు.

వనమహోత్సవం లక్ష్యం పూర్తి చేయాలి



ఆచార్యపూర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో కాళప్ప

కోయిలకొండ, జూలై 15 : కోయిలకొండ మండలంలో వనమహోత్సవం వందశాతం లక్ష్యం పూర్తి చేయాలని ఎంపీడీవో కాళప్ప సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని ఆచార్యపూర్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. 'నిర్లక్ష్యం నీడలో వనమహోత్సవం' అని 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. దాంతో ఆయన స్పందించారు. గ్రామాల వారిగా మొక్కలు నాటే కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. మండలంలో మూడు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. ఇందుకు తగిన విధంగా సిబ్బంది పని చేయాలన్నారు. ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీజ, మాజీ సర్పంచ్ రాము, ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ నాయకులు వెంకటేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి మంటలు



దగ్ధమైన బైక్ మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొత్తకోట, జూలై 15 : ద్విచక్ర వాహనంలో మంటలు వచ్చిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన సాయినాథ్ రైన్‌కోట్ ధరించి అపాచీ బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నాడు. కొత్తకోట మండలం నాటవెల్లి శివారులో వెళ్తుండగా బైక్ ఇంజన్ హీట్‌కు రైన్‌కోట్‌కు మంటలు వచ్చాయి. గమనించిన సాయినాథ్ బైక్‌ను పక్కకు ఆపి అగ్నిమాపక వాహనానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహన సిబ్బంది అక్కడకు వెళ్లి మంటలను ఆర్పారు. కాని అప్పటికే బైక్ పూర్తిగా ఖాళీపోయింది. కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తాడూరు, జూలై 15 : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం యంగంపల్లి గేటు సమీపంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...యంగంపల్లి గ్రామానికి చెందిన మల్లేష్(32), రాజు అనే వ్యక్తి ఇద్దరు కలిసి తాడూరు నుంచి మోటారు సైకిల్ పై డీజిల్ తీసుకొని గ్రామానికి వస్తున్నారు. గ్రామ సమీపంలోకి రాగానే కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న కారు మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో మల్లేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు క్షతగాత్రులను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మల్లేష్ మృతి చెందాడు. రాజుకు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు సంఘటన స్థలం నుంచి వెళ్లిపోగా గ్రామస్థులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు తాడూరు సమీపంలోని కారును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి భార్య అనిత, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహేష్ తెలిపారు.

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా గద్వాల విద్యార్థి

గద్వాల టౌన్, జూలై 15 : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన వామనపల్లి రంగస్వామి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సోమాజికూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో రంగస్వామి ఎన్నియ్యారని యూఎస్ఎఫ్ఐ జాతీయ కో కన్వీనర్ వంగూరి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల, ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఆగడాలు, విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీ, ప్రభుత్వ యూని వర్సిటీలకు రెగ్యులర్ వీసీల నియామకం తదితర సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ త్వరలోనే రాష్ట్ర స్థాయి ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

మాంసం..నాసిరకం

- పురపాలికల్లో పనిచేయని స్లాటర్‌హౌస్ వ్యవస్థ
- ఇదివరకు అక్కడే జీవాలను కోసి ముద్రలు వేసేవాళ్లు
- కొన్నేళ్లుగా ఈ వ్యవస్థకు స్వస్తి
- వ్యాపారులే ఇష్టానుసారంగా మాంసం తీసుకువచ్చి విక్రయం
- వాటిని తనిఖీ చేయని పురపాలిక.. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు



మహబూబ్‌నగర్ పురపాలిక పరిధిలో నిర్మించిన స్లాటర్‌హౌస్

మహబూబ్‌నగర్, జూలై 15: ఆదివారం వచ్చిందంటే మాంసం దుకాణాలు కిటకిటలాడతాయి..అరగంట, గంట పాటు వేచి ఉండి మరీ కొనుగోలు చేస్తుంటారు.. ఇకపండగలు వచ్చాయంటే దుకాణాల ముందు బారులు తీరుతారు.. భోజనప్రియులు నాన్‌వెజ్‌కు అంతగా ప్రాధాన్యం ఇస్తున్నారంటే అందులో అతిశయోక్తి లేదు..అకేషన్ ఏదైనా దావత్ ఉందంటే అందులో ముక్క ఉండాల్సిందే..అయితే జనం ఎంతో ఇష్టంగా భుజించే మాంసం విక్రయాలపై పర్యవేక్షణ కొరవడింది..ఎలాంటి మాంసం విక్రయిస్తున్నారు ? ఆరోగ్యకరమైన జీవాలనే విక్రయిస్తున్నారా? అన్న అనుమానాలు ప్రజల్లో నెలకొంటున్నాయి. ఇదివరకు మునిసిపాలిటీలలో స్లాటర్‌హౌస్(కబేళా) వ్యవస్థలు ఉండేవి. మాంసం విక్రయించే వ్యాపారులు జీవాలను అక్కడికే తీసుకెళ్లాలి. అక్కడ ఉన్న సిబ్బంది అవి ఆరోగ్యవంతంగా ఉన్నాయా ? లేదా ? అని చెక్ చేశాక అక్కడే వాటిని కట్ చేసి తోలు తీశాక మాంసంపై మూడు, నాలుగుచోట్ల అధికారికంగా ముద్రలు వేసేవాళ్లు. ఆ ముద్రలు వేసిన మాంసమే మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంటుంది. ఒకవేళ వాటిపై పురపాలిక స్టాంప్ లేదంటే ఆ మాంసం నాసిరకమైనదని అర్థం. మళ్లీ పురపాలిక సిబ్బంది వెళ్లి దుకాణాలలో తనిఖీలు చేసి చర్యలు తీసుకునేవాళ్లు. ఇప్పుడు ఉమ్మడి పాలమూరులోని ఏ మునిసిపాలిటీలోనూ ఈ వ్యవస్థ లేకపోవడం వల్ల వ్యాపారులు తమ ఇష్టానుసారంగా జీవాలను వారి ఇళ్లవద్దనే కట్ చేసి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఇక వాటిని పర్యవేక్షించాల్సిన పురపాలిక, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌లు వాటి జోలికే వెళ్లడం మానేశారు. దీంతో పలువురు వ్యాపారులు అనారోగ్యం బారిన పడిన జీవాలను, పొట్టేళ్లకు బదులు గొర్రెలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

స్లాటర్ వ్యవస్థను తీసుకురావాలి

ఉమ్మడి జిల్లాలోని అతిపెద్ద పురపాలిక అయిన పాలమూరులో దాదాపు మూడు లక్షల మంది వరకు జనాభా ఉన్నది. పట్టణం విస్తరించడంతో వందల సంఖ్యలో ఎక్కడ పడితే అక్కడ మాంసం దుకాణాలు వెలిశాయి. ఇదివరకు మార్కెట్, అవంతి హోటల్ ఎదురుగానే పదుల సంఖ్యలో దుకాణాలు ఉండేవి. వాటిని పర్యవేక్షించడం కూడా సులభంగా ఉండేది. ఇప్పుడు గల్లీగల్లీలో వందల సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. పెద్ద మునిసిపాలిటీలు అయిన వనపర్తి, నారాయణపేట, గద్వాల, జడ్చర్ల, నాగర్‌కర్నూల్‌లోనూ పెద్దఎత్తున దుకాణాలను ఏర్పాటు చేసుకుని మాంసం విక్రయాలు చేస్తున్నారు. ఇప్పుడు వీటి పర్యవేక్షణ కూడా ఇబ్బందికరమే మారిది. అయితే ర్యాండమ్‌గా ప్రతీవారం కొన్ని దుకాణాలనైనా తనిఖీ చేస్తే అధికారులు తనిఖీ చేస్తారన్న భయం ఉంటుందని మాంసం ప్రియులు అభిప్రాయపడుతున్నారు. పాలమూరు పురపాలికలో పదళ్లక్రితం రామయ్యబౌలిలో స్లాటర్‌హౌస్ ఉండేది. అక్కడే జీవాలను కట్‌చేసి ముద్రలు వేసి పంపేవారు. ఆ తరువాత స్లాటర్‌హౌస్ తొలగించడంతో ఆ స్థానంలో ఇప్పుడు శిల్పారామం, రామయ్యబౌలి పీహెచ్‌సీలు వెలిశాయి. ఇది ఇళ్ల మధ్య ఉండటంతో దుర్గంధం వస్తుందని, చిన్నదర్పల్లి పరిసరాలలోని ఇందిరానగర్ కాలనీలో రూ.6.12 కోట్లతో స్లాటర్ హౌస్ నిర్మాణం చేపట్టారు. అయితే అందులో ఇప్పటివరకు మిషనరీలను ఏర్పాటు చేయకపోవడం వల్ల భవన నిర్మాణం పూర్తైనా ఉపయోగంలోకి తీసుకురాలేదు. అక్కడ మిషనరీలు ఏర్పాటుచేసి గతంలో మాదిరిగా జీవాలను అక్కడే కట్ చేసి ముద్రలు వేయాలని ప్రజలు కోరు తున్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ సభ్యులు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మాంసం విక్రయాలు నాసిరకంగా ఉన్నాయన్న ఫిర్యాదులు వస్తుండటంతో వెంటనే స్లాటర్‌హౌస్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సభ్యులు డిమాండ్ చేశారు.

ధరకు తగ్గ క్వాలిటీ ఉండాలి

మాంసం ధర కిలో ప్రస్తుతం రూ.800కు చేరింది. దసరా, సంక్రాంతి పండగ వచ్చినపుడల్లా వ్యాపారులు తమ ఇష్టానికి రూ.20-30 పెంచుతూ పోతున్నారు. అయితే అందుకు తగ్గ క్వాలిటీ ఆహారం అందించాలని జనం కోరుతున్నారు. పొట్టేలుకు ధర ఎక్కువగా ఉంటుంది. అదే గొర్రెలకు అందులో 30-40 శాతం ధర తక్కువగా ఉంటుంది. వ్యాపారులు మాత్రం పొట్టేలు మాంసం అని ఒకే ధర ఫిక్స్ చేసి విక్రయిస్తున్నారు. అయితే దాదాపుగా దుకాణాలలో పొట్టేలు మాంసం కన్నా గొర్రె మాంసమే ఎక్కువగా విక్రయిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. ధర పెంచినపుడు అందుకు తగ్గ క్వాలిటీ కూడా మెయింటెన్ చేయాల్సి ఉండగా, తక్కువ ధరకు వచ్చే గొర్రెలను కట్ చేసి పొట్టేలు ధరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిపైనా పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ఇక కాల్చిన కూర విక్రయాలపైనా పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి జిల్లాకేంద్రంతోపాటు కొత్తకోట, పెబ్బేరు, సీసీకుంట, అమరచింతలో కాల్చిన కూరకు మంచి డిమాండ్ ఉంది. వివిధ ప్రాంతానుంచి జనం అక్కడికి వచ్చి కాల్చిన కూర తీసుకుంటారు. అందుకూ వీటిపై కూడా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇక హోటళ్ళు, రెస్టారెంట్‌లకు పెద్దఎత్తున మాంసం సరఫరా చేస్తారు. బయట విక్రయించే మాంసం విక్రయాలు ఒక ఎత్తైతే హోటళ్లు, రెస్టారెంట్‌లలోనూ పెద్దఎత్తున మాంసంకు సంబంధించిన ఆహార ఉత్పత్తులు సేల్ అవుతుంటాయి. ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ తనిఖీలలోనూ పలుమార్లు నాసిరకం ఆహారం ఉన్నట్లు బయటపడినా రెగ్యూలర్‌గా తనిఖీలు లేకపోవడం, వీరికి సరఫరా చేసే మాంసం ఉత్పత్తులపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రజలకు పూర్తిస్థాయిలో క్వాలిటీ అందకపోవడం వల్ల రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

తెలంగాణలో వాల్మీకులకు అన్యాయం

- అధికారం మనదైనప్పుడే ఎస్టీ జాబితా సాధిస్తాం
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి
- అలంపూర్ నుంచి భారీ ర్యాలీ
- వాల్మీకి ప్రజాప్రతినిధుల సన్మాన సభ విజయవంతం





సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, హాజరైన వాల్మీకి సోదరులు

అలంపూర్ చౌరస్తా, జూలై 15: తెలంగాణ రాష్ట్రంలోని వాల్మీకులకు రాజకీయంగా తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలో అలం పూర్ నియోజకవర్గంలోని మాజీ వాల్మీకి ప్రజాప్రతినిధులకు ఐక్యవాల్మీకి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు క్యాతూరు మద్దిలేటి, ఎర్రవల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు నీలి శ్రీనువాసులు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ మధుసూదన్‌నాయకుడు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాములు, ఏపీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి గుడిసె కిష్టమ్మ, ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరంజనేయులు తదితర ముఖ్య నాయకులతో పాటు అలంపూర్ నియోజకవర్గంలో ఎనిమిది మండలాల వాల్మీకి నాయకులు హాజరయ్యారు. మొదట అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నీలి శ్రీనువాసులు ఆధ్వర్యంలో అలంపూర్ పట్టణం నుంచి అలంపూర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో వంద అడుగుల గజమాలను క్రేన్ సాయంతో ముఖ్యఅథితులకు అలంకరించారు. అనంతరం ఏజెఆర్ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ప్రజా ప్రతినిధులను సన్మానించారు. అంతకుముందు ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రెండుతెలుగు రాష్ట్రాలలోనే వాల్మీకులు బీసీఏలుగా ఉన్నారనే విషయాన్ని ఇటీవల ఎన్నికల ప్రచారంలో మన ప్రధానమంత్రి మోదీకి చెప్పగా, ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారని అన్నారు. తప్పకుండా వాల్మీకులకు న్యాయం చేస్తానని మోదీ హామీ ఇచ్చారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు లక్షల ఓట్లు ఉన్న వాల్మీకులకు టికెట్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇక నుంచి టికెట్ ఇవ్వని పార్టీలను ఓడించాలని, టికెట్ రాకున్న వచ్చే స్థానిక ఎన్నికల్లో ఇండిపెండెంట్లుగా వాల్మీకులు పోటీచేయాలని, అందరు ఏకమై మనవాడిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

జగన్‌కు సవాల్ విసిరి వైసీపీ నుంచి బయటకు వచ్చా

వాల్మీకులు, టీడీపీ కార్యకర్తల బలంతో మళ్లీ ఎమ్మెల్యే అవుతానని జగన్‌కు సవాల్ విసిరి వైసీపీ నుంచి బయటకు వచ్చానని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాములు అన్నారు. ఏపీలో వాల్మీకులంతా ఐక్యంగా ఉండబట్టే అన్ని పార్టీలు గౌరవించి టికెట్లు ఇస్తున్నాయని అది తెలంగాణలో జరగడం లేదన్నారు. వాల్మీకులు ఐక్యంగా ఉన్నప్పుడే పార్టీలు మనల్ని గుర్తిస్తాయని లేదంటే ఓట్లకు మాత్రమే వాడుకుని వదిలేస్తారని అన్నారు. కత్తి వదిలి కలం పట్టిన వాల్మీకి మహర్షే మనకు ఆదర్శమని, అందరు చదువుకున్నప్పుడే మనజీవితాలు మారుతాయని ఏపీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి గడిసె కిష్టమ్మ అన్నారు. బోయలంతా ఏకమైతే నడిగడ్డలో 1.25లక్షల ఓట్లు ఉన్న మనమే ఎమ్మెల్యేలు కావచ్చని ఎర్రవల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు నీలి శ్రీనువాసులు అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అన్ని అవకాశం ఉన్న గ్రామాలలో పోటీ చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు క్యాతూరు మద్దిలేటి అన్నారు. సమావేశంలో దాదాపు పదివేలమంది వాల్మీకులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 15 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ రాష్ట్ర మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ నిరుద్యోగ యువతకు టీజీపీఎస్‌టీ గ్రూప్-1 మెయిన్స్ కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాశాఖ అధికారి ఆర్. ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 19లోగా రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 040-23236112 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉప్పునుంతల, జూలై 15: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న గ్రామానికి చెందిన మందుల శ్రీకాంత్ (21) రోడ్డు ప్రమాదానికి గురైయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

కాడెద్దుల దొంగతనం

మాగనూరు, జూలై 15: నారాయణపేట జిల్లా మాగనూరుకు చెందిన రైతు గడ్డం వెంకటయ్యకు చెందిన కాడెద్దులను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డం వెంకటయ్య తన పొలం వద్ద ఎద్దులను కట్టేసి వర్షం రాగా ఇంటికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున పొలం దగ్గరకు వెళ్లి చూడగా ఎద్దులు కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒక ఆటో, 26మంది విద్యార్థులు

- బస్సు లేకపోవడంతో ప్రమాదకర ప్రయాణం



ప్రమాదకరంగా ఆటోలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

రాజోలి, జూలై 15 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు రవాణా వసతి లేక ఆటోల్లో ప్రమాదకంగా ప్రయాణం చేస్తున్నారు. గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పచ్చర్ల గ్రామంలో ప్రైమరీ పూర్తి చేసుకుని ఉన్నత పాఠశాలకు చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులు ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణం చేస్తున్నారు. మాన్‌దొడ్డి గ్రామంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకు నేందుకు పచ్చర్ల గ్రామం నుంచి దాదాపు 70 మంది విద్యార్థులు ప్రతీ రోజు ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉన్నది. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రమాదకరమని తెలిసినా ఆటోల్లో కిక్కిరిసి ఇళ్లకు చేరుతున్నారు. సోమవారం 26మంది విద్యార్థులు ఆటోలో ప్రయాణించారు. రహదారులు సరిగా లేక పోవడంతో ఎక్కడ ప్రమాదాలకు గురవుతారోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. గద్వాల బస్సు డిపో అధికారులు స్పందించి క్రమం తప్పకుండా పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షాలు కురవాలని శివుడికి పూజలు



నీళ్లలో మునిగిపోయిన శివలింగం

పెద్దమందడి, జూలై 15: ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వరుణుడు ముఖం చాటేయ డంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు వేసే సమయం దాటి పోతున్నా వర్షాలు పడక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. దీంతో వర్షాలు కురువాలని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామస్థుల ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున శివునికి అభిషేకాలు చేశారు. గ్రామంలోని శివాలయం గుర్భగుడిలోని శివ లింగం చుట్టూ ఐదు అడుగులు ఎత్తు ఒండ్రు మట్టితో కట్ట కట్టి లింగం మునిగిపోయే వరకు బిందెలతో నీళ్ల పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షాకాలు కురువకపోతే కష్టకాలమే..

ఈ ఏడాది వర్షాలు కురువకపోతే రైతుల మరోసారి కరువు కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. పంటల సాగుకు నైరుతి ఋతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలే ప్రధాన ఆధారం. ప్రస్తుత ఖరీఫ్ ప్రభావం చూపిస్తాయి. దీంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తమ పూర్వీకులు ఆచరించిన ఈ పద్ధతిని ఈ ఏడాది అమలు చేస్తున్నామన్నారు. రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురుస్తాయని గ్రామస్థులు ఆశ భావం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడు రాలేదని.. పాఠశాల ముందు విద్యార్థుల ఆందోళన



కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అయిజ, జూలై 15 : ఉపాధ్యాయుడు రావడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. అయిజ మండల పరిధిలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు వడ్డేపల్లి మండలం కొంకల గ్రామానికి బదిలీపై వెళ్లారు. ఈ పాఠశాలకు కేటాయించిన ఉపాధ్యాయుడు ఇప్పటి వరకు రాలేదు. దీంతో పాఠశాలలో విద్యా బోధన సాగడం లేదు. దీంతో సోమవారం ఉదయం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడు వెంటనే పాఠశాలకు రావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి, కలెక్టర్ తగిన చర్యలు తీసుకొని, సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే జాతీయ రహదారిపై ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

ఐటీడీఏ పీవోగా ఐఏఎస్‌ను నియమించాలి

- చెంచుల భూములకు హక్కుల పత్రాలు ఇవ్వాలి
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా



ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న చెంచులు, సంఘం నాయకులు

కొల్లాపూర్, జూలై 15 : ఐటీడీఏ పీవోగా ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో నివసించే ఆదివాసి చెంచు గిరిజనులతో కలిసి కొల్లాపూర్ పట్టణంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.శివవర్మ అధ్యక్షతన కొనసాగిన ధర్నానుద్దేశించి రవికుమార్, భీంరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కృష్ణారెడ్డి మాట్లాడారు. గడిచిన పాతికేళ్ల క్రితం నల్లమల అటవీ ప్రాంతం నుంచి చెంచు గిరిజనులను, పెంటలను తరలించి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెండు మండలాల పరిధిలో పునరావాసం ఏర్పాటు చేస్తామని నమ్మబలికి చెంచులను మైదాన ప్రాంతాలకు తరలించారన్నారు. చెంచులకు పక్కా ఇళ్లు, కరెంటు, రోడ్లు, మంచినీటి వసతులు, పిల్లల చదువులకు కావాల్సిన పాఠశాలలు, కనీస సౌకర్యాలు ఏవీ కల్పించలేదన్నారు. చెంచుల జీవనోపాధికి కావాల్సిన ఏర్పాట్లు చేయలేదని, ఆధార్, రేషన్‌కార్డు లాంటి గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని వారు ప్రభుత్వంపై మండిపడ్డారు. చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వం వారికి కేటాయించిన భూములను ఇతరులు చెంచులను బెదిరించి వారి భూములను బలవంతంగా లాక్కుని చెంచులనే కూలీలుగా మార్చుకుంటున్నారని వారు ధ్వజమెత్తారు. చెంచులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మొలచింతలపల్లి భ్రమరాంబకాలనీలో బాధిత చెంచు మహిళపై జరిగిన దాడి ఘటనపై హైకోర్టు జడ్జితో పూర్తి జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోగా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో నాగరాజుకు అందజేశారు. ఆదివాసి చెంచు సంఘం అధ్యక్షుడు హనుమంతు, వెంకటేశ్, మొలచింతలపల్లి మాజీ సర్పంచ్ వెంకటస్వామి, శివ, మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ, రైతు సంఘం మండల కార్యదర్శి బాలపీరు, సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, ఎం.దశరథం, ఆవాస్ సంఘం జిల్లా కన్వీనర్ ఎండి.సలీం, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అశోక్, మత్స్యకార్మిక సంఘం జిల్లా నాయకులు కిరణ్‌కుమార్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి బాలునాయక్, జల్లాపురం సురేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్



దేశిటిక్యాల గ్రామంలో రైతులతో మాట్లాడి పంటల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని దేశిటిక్యాల గ్రామ పరిధిలో ఉన్న పంట పొలాల్లో వేసిన పత్తి, వరి పంటల సాగు చేస్తున్న రైతులు నాగయ్య, రాములు, శేఖర్‌రెడ్డిలతో కలెక్టర్ బదావత్ సంతోష్ సోమవారం మాట్లాడి పంటలను పరిశీలించారు. రైతులకు ఎన్ని ఎకరాల పొలంలో ఏ పంటలను సాగు చేస్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో, మండలంలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీనివాస, ఆగ్రో గ్రోమోర్ విత్తనాల దుకాణాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విత్తనాల, యూరియా స్టాక్ రిజిష్టర్లను, రైతుల వారిగా విక్రయించిన విత్తనాలు యూరియా రిజిష్టర్లను కలెక్టర్ పరిశీలించారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, నాగర్‌కర్నూల్ డివిజనల్ వ్యవసాయ అధికారి రమేష్‌బాబు, నాగర్‌కర్నూల్ మండల వ్యవసాయ అధికారి నర్మద తదితరులు ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారం చూపాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కే.సీతారామారావుతో కలిసి ఆయన ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెనువెంటనే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఫిర్యాదులను పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పరిష్కారం కాని వాటికి ఉన్నతాధికారులకు లేదా సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 49ఫిర్యాదులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, జూలై 15: వర్షాకాలంలో రోగాలు ప్రబలకుండా పట్టణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట మునిసిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం సోమవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని కాలువలలో మురుగునీరు రోడ్లపై పారకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ముసురు వర్షాలు కురుస్తున్నందున మట్టి మిద్దెలు గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. కమిషనర్ శ్యాంప్రసాద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం పనులు ప్రారంభం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు వైద్యం అందించేందుకు కావాల్సిన వసతులు సమకూరుస్తోందన్నారు. శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి కల్పించేందుకు దుకాణ సముదాయాల షెటర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ డీఈ వెవకటేశ్వర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సుబ్బయ్య యూనివర్సిటీగా అభివృద్ధి పర్చాలి



పాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యారాణిని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, పూర్వ విద్యార్థులు

బిజినేపల్లి, జూలై 15 : స్వయం ప్రతిపత్తి హోదాను సద్వినియోగం చేసుకొని కళాశాలను సుబ్బయ్య యూనివర్సిటీగా అభివృద్ధి పర్చేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు పాటుపడాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ కోరారు. మండలంలోని పాలెంలోని వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా వచ్చేందుకు కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యారాణిని సోమవారం మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ పూర్వ విద్యార్థులతో కలిసి సన్మానించి మాట్లాడారు. కళాశాల స్థాపించి 60 ఏళ్లకు అటానమస్ హోదా రావడంతో కళాశాల అభివృద్ధికి బాటలు పడ్డాయని సంతోషం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పాలెం కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించి ఈప్రాంత పేద ప్రజలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పిస్తే పరిశోధనలు చేసి నూతన అవిష్కరణలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కళాశాలకు ఖ్యాతిని తీసుకవస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట పూర్వ విద్యార్థులు రఫీ, రవీందర్ రెడ్డి, జగదీష్, రామకృష్ణ, చందు, సుల్తాన్, శేఖర్, భాను, భాస్కర్, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు



రిటైర్మెంట్ పొందిన నిరంజన్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు

చారకొండ, జూలై 15: మండల పరిధిలోని తుర్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు స్వాతి, మంజురాణి, ప్రమోషన్‌పై వెళ్లారు. అదేవిధంగా పి.కవిత మండలంలోని జూపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం మహిపాల్‌నాయక్ అధ్యక్షతన ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో శంకర్‌నాయక్, మండల కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చిన్నయ్య హాజరై ప్రమోషన్, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో 45 ఏళ్లుగా స్వీపర్‌గా పనిచేసి రిటైర్మెంట్ పొందిన నిరంజన్‌ను ఎంఈవో శంకర్‌నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సన్మానించారు. పాఠశాలలో చదివిన తుర్కలపల్లికి చెందిన పూర్వవిద్యార్థులు సురేష్, నరేష్ పాఠశాలకు మైక్ సెట్‌ను బహూకరించారు. ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, సంధ్యారాణి, యాదమ్మ, కవిత, తుల్య్ కృష్ణయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు కన్నీటి వీడ్కోలు

కోడేరు: మండల కేంద్రంలోని దళితవాడ పాఠశాలలో గత పది సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా పని చేసిన శ్రీలత, స్వామి అనే ఉపాధ్యాయులు ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తుండడంతో ఆ పాఠశాల విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మా పాఠశాలలోనే ఉండాలంటూ మమ్మల్ని విడిచి వెళ్లొద్దంటూ విద్యార్థులు కన్నీరు పెట్టడంతో 'మీ నుంచి మేము ఎక్కడికి వెళ్లలేమంటూ మీకు ఎల్లప్పుడు అందుబాటులోనే ఉంటామని' ఉపాధ్యాయులు ఓదార్చారు.

గ్రామాల్లో పీర్ల సంబురాలు

- పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



లింగాల బంజారా వీధిలోని చావడిలో కొలువుదీరిన పీర్లు

లింగాల, జూలై 15 : తప్పెట దరువులకు ధూలా, అసోన్ ధూలా అంటూ అలాయ్ చుట్టూ యువకులు చిందులు వేస్తూ ఉత్సాహంగా సాగే పీర్ల పండుగతో నల్లమల ప్రాంతంలోని లింగాల మండలంలోని అనేక గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. తెలంగాణ పల్లెల్లో పీర్ల పండుగ వచ్చిందంటే పది రోజులపాటు ఎంతో ఉత్సాహంగా సంబురంగా హిందూ, ముస్లిం అనే మతభావం లేకుండా అందరూ కలిసి సంబురాలు జరుపుకోవడం ఆనవాయితీ. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు మొహర్రం పండుగకు తమ మొక్కుబడి తీర్చుకోవడానికి చాలా మంది తమ స్వగ్రామాలకు తిరిగి రావడంతో ఈ వేడుకలు ఎంతో సంబురంగా జరుపుకుంటున్నారు. పీర్ల పండుగ సందర్భంగా గ్రామాల్లోని యువకులు వివిధ రకాలైన వేషాలు, షావుకారు తదితర వేషాలు వేసి వారి భాషను వారి నడకను అనుకరించి అందరినీ సంతోషపరుస్తారు.

పీర్ల పండుగ సందర్భంగా పీర్లకు మొక్కుబడులు చెల్లించుకుంటే తమ కష్టాలు తొలగిపోతాయనే భావంతో ఈ ప్రాంత వాసులు చెల్లిస్తూ ఉంటారు. చాలా గ్రామాల్లో పీర్ల పండుగను ముస్లింల కంటే హిందువులే ఎక్కువగా జరుపుకుంటారు. లింగాల మండలంలోని అంబటిపల్లి, ధారారం, కొత్తకుంటపల్లి, అవుసలికుంట, సురాపూర్, రాయవరం, కోమటికుంట, చెన్నంపల్లి గ్రామాల్లో ఘనంగా జరుపుకునే ఈ ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి పీర్లను దర్శించుకుని దట్టీలు, కొబ్బరి కుడకలు, బెల్లం వంటివి సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. పీర్ల చావిడి ఎదుట ఏర్పాటు చేసిన పెద్ద అగ్నిగుండం చుట్టూ మొహర్రం పండుగ వరకు రాత్రివేళ



బల్మూరులో పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

ల్లో యువతీ యువకులు కలిసి అలాయ్ పేరుతో ఆట పాటలతో సంబురాలను జరుపుకుంటున్నారు. ముసురుతో కూడిన వర్షం మొహర్రం ఉత్సవాలకు అడ్డంకిగా ఇబ్బందికరంగా మారినప్పటికీ భక్తులు అదేమి పట్టించుకోకుండా సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలను జరుపుకుంటున్నారు. హిందూ ముస్లింల ఐక్యతకు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగ ఉత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ గ్రామాల్లోని ప్రధాన వీధులగుండా పీర్లను ముసురుతో కూడిన వానలో సైతం నడుస్తూనే ఊరేగిస్తూ సందడి చేశారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

బల్మూరు: మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. సోమవారం 8వ రోజు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారని నిర్వాహకులు సయ్యద్ చాంద్‌పాష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీర్ల చావిడి శిథిలావస్థకు చేరిందని స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ పరిశీలించి నూతన పీర్ల చావిడి నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై 15 : ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందని ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. పామాయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని సిలారుపల్లిలో సత్యనారాయణ అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట సాగుతో 30ఏళ్ల వరకు నిరంతరం ఆదాయం పొందవచ్చన్నారు. వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు తదితర అంతర్ పంటలను సాగు చేసుకుని మరింత ఆదాయం పొందే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీతోపాటు బ్యాంకుల ద్వారా రుణ సహాయం అందుతుందన్నారు. మాజీ సర్పంచ్‌లు బ్బంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, జిల్లెల రాములు, దామోదర్ గౌడ్, కౌన్సిలర్లు గోరటి శ్రీనివాసులు, రవీందర్, జిల్లా ఉద్యాన, పట్టు, పరిశ్రమ అధికారి డి.చక్రపాణి, కల్వకుర్తి ఉద్యాన అధికారి పి.ఇమ్రాన్, నాగర్‌కర్నూల్ ఉద్యాన అధికారి కే.చంద్రశేఖర్, కొల్లాపూర్ ఉద్యాన అధికారి ఎం.లక్ష్మణ్, అచ్చంపేట ఉద్యాన అధికారి సౌమ్యం, నాయకులు హనుమాన్‌నాయక్, రాంరెడ్డి, రమాకాంత్, సతీష్‌కుమార్, లక్ష్మయ్య, వెంకటేష్, సురేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 15: అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అంగన్‌వాడీ టీచర్లు ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాన రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ బెనిఫిట్ చెల్లించి రూ.5 వేలు ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు ఉండటం సరికాదన్నారు. అంగన్‌వాడీ టీచర్లుగా 65 సంవత్సరాలు దాటిన వారికి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇచ్చి ఇంటికి పొమ్మనడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.2 లక్షలు చెల్లించడంతో పాటు రూ.5 వేల పెన్షన్ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి గీత, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ, సుచిత్ర, రజియా, విజయలక్ష్మి, వెంకటమ్మ, అంజనమ్మ, సుగుణమ్మ, కృష్ణవేణి, అలివేల, కౌసల్య, భారతి, అనురాధ, లక్ష్మి పాల్గొన్నారు.

● కొల్లాపూర్: అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యేల నివాస గృహాల ముందు ధర్నాలో భాగంగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కేఎల్ఐ గెస్ట్‌హౌస్ ముందు అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వం రిటైర్మెంట్ సందర్భంగా టీచర్‌కు రెండు లక్షల రూపాయలు, ఆయాకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడం లేదన్నారు. గత సంవత్సరం ఎన్నికల ముందు 25రోజుల పాటు సమ్మె చేస్తే సమ్మె కాలపు వేతనం నేటికీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు అనేక హామీలు ఇచ్చిందని ఏ ఒక్క హామీ అమలుపర్చడం లేదని ఈశ్వర్ ధ్వజమెత్తారు. అనంతరం తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక అధికారులకు సీఐటీయూ నాయకులు అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.దశరథం, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సాయిలీల, కార్యదర్శి నీరజ, ఉపాధ్యక్షురాలు నిర్మల, సహాయ కార్యదర్శి దేవి, హుసేనమ్మ, లక్ష్మీ, జ్యోతి, సులోచన, వెంకటమ్మ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం కల్పించాలి

బిజినేపల్లి, జూలై 15 : రాష్ట్రంలో అత్యధిక జనాబా ఉన్న తెలుగు మత్స్యకార ముదిరాజ్‌లకు రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం ప్రభుత్వం కల్పించాలని తహసీల్దార్ కార్యాలయంలో ముదిరాజ్ మహాసభ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. మండల కేంద్రంలోని మత్స్యకార సహకార సంఘం భవనం నుంచి ముదిరాజ్ మహాసభ నాయకులు సోమవారం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి డీటీకి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చడంతో పాటు వెనకబడిన తరగతుల్లో అత్యధిక జనాబా ఉన్న విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సరైన ప్రాతినిధ్యం, అవకాశాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా మత్స్యకారుల అభివృద్ధి కోసం మత్స్య కోఆపరేటివ్ ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన ప్రతీ మత్స్యకారుడికి పింఛన్ అందించి ఆదుకోవాలని కోరారు. కోకపేట ముదిరాజ్ ఆత్మగౌరవ భవనానికై గత ప్రభుత్వం ఐదు ఎకరాల భూమితో పాటు రూ.5 కోట్లు కేటాయించగా భవనం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు రూ.20 కోట్లతో పాటు 10 ఎకరాల భూమి కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తుమ్మల అల్లోజీ, సొప్పరి బాలస్వామి, మస్కూరి బంగారయ్య, వెంకటస్వామి, సహదేవుడు, మిద్దె యాదయ్య, ప్యాట శంకర్, వేమ వెంకట్రాములు, గూడ కాశన్న, నరసింహ, జంగయ్య, మన్యంకొండ, మల్లికార్జున్, తిరుపతయ్య, బాలస్వామి, బాశమోని ఆంజనేయులు, కంపిండ్ల శ్రీశైలం, పర్వతాలు, ఆంజనేయులు, కేశవులు, తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకార ముదిరాజ్ మహాసభ నాయకులు

అవుట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 15: జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మూడో ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న వారి వేతనాలను ఆరు నెలలుగా చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న లెజెండ్ ఏజెన్సీ కాంట్రాక్టును రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ లెజెండ్ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ డిసెంబరు 2021లో మూడో ఏఎన్‌ఎంలను నియమించి వారికి వేతనాలు సకాలంలో చెల్లించకపోవడమే కాకుండా కనీసం అప్పటి నుంచి పీఎఫ్ డబ్బులు కూడా అందక వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి లెజెండ్ ఏజెన్సీ కాంట్రాక్టు రద్దు చేసి వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు పద్మ, సరిత, భాగ్య, శ్రీలత, విజయ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

కల్వకుర్తిటౌన్, జూలై 15 : కూలీలకు ఉపాధి హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని నాగర్‌కర్నూల్ జిల్లా అంబుడ్స్‌పర్సన్ నల్ల జంగయ్య అన్నారు. సోమవారం మండలంలోని తర్నికల్ గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలించి మాట్లాడారు. ప్రతి నెల మూడో శుక్రవారం కూలీలకు సమావేశం ఏర్పాటుచేసి సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రికార్డుల్లో కూలీల వివరాలు అసంపూర్తిగా ఉన్నాయని, రోజ్‌గార్‌దివాస్ కార్యక్రమంలో నిర్వహించడంలేదని గుర్తించినట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూలీల సమస్యలు తెలియజేసేందుకు ఫిర్యాదుల బాక్స్‌ను, టోల్ ఫ్రీనెంబర్‌ను రాసి పెట్టాలని, జాబ్‌కార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ఉపాధి కూలీలకు పేస్లిప్పులు ఇవ్వాలని వివరించారు. సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. కూలీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు

అమ్రాబాద్, జూలై 15: అమ్రాబాద్, పదర పశువైద్య కేంద్రాలలో 75 శాతం సబ్సిడీపై మేలు రకం పశుగ్రాస విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అమ్రాబాద్ పశువైద్య కేంద్రం అధికారి డాక్టర్ అనిల్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో పశుగ్రాసం కొరత ఏర్పడితే రైతులు ఇబ్బందులకు గురికాకుండా పశుగ్రాస విత్తనాలను తీసుకెళ్లి రైతులు తమ పొలాల్లో చల్లుకోవాలని అన్నారు.

నడింపల్లిలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహం ప్రతిష్ఠ



లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్థులు

అచ్చంపేటటౌన్, జూలై 15: మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గ్రామస్థులు స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, మాధవ రెడ్డి, రామనాథం, రాములు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు వేదమంత్రాలతో ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తీర్నాంపల్లిలో వైద్య శిబిరం విజయవంతం

పెద్దకొత్తపల్లి, జూలై 15 : మండల పరిధిలోని తీర్నాంపల్లి గ్రామంలో పెద్దకొత్తపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. సోమవారం తీర్నాంపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామంలోని 46 జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేశారు. సూపర్‌వైజర్ భాగ్యమ్మ, ఏఎన్‌ఎంలు నాగమణి, రేణుక, ఆశ కార్యకర్తలు పి.భాగ్యమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో విద్యార్థి సంఘం నాయకులు

కొల్లాపూర్, జూలై 15 : విద్యార్థి నిరుద్యోగయువత సమస్యలు పరిష్కరించాలని డీఎస్సీ వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు బలవంతంపు అరెస్టు చేయడం దురదృష్టకరమని బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు డి.శేఖర్, అన్వేష్‌గౌడ్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి బి.దాస్‌లు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ సచివాలయం ముట్టడి పిలుపులో భాగంగా కొల్లాపూర్‌లో విద్యార్థి సంఘం నాయకులు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు బీఆర్ఎస్వీ, బీఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నిర్బంధిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ వాయిదా వేసే వరకు ప్రభుత్వ తీరుపై తాము పోరాడుతామని వారు పేర్కొన్నారు. పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు శేఖర్, అన్వేష్‌గౌడ్, కాటం విష్ణుతేజ, కాటం మౌలాలి తదితరులు ఉన్నారు.

సీఎంని కలిసిన సింగిల్ విండో డైరెక్టర్



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సింగిల్ విండో డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి

కోడేరు, జూలై 15 : కోడేరు మండల కేంద్రానికి చెందిన డైరెక్టర్ మల్లెపల్లి జగన్మోహన్‌రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మండల అభివృద్ధి కోసం సహకరించాలని కోరారని జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. అందుకు రేవంత్‌రెడ్డి స్పందించారని తెలిపారు. భవిష్యత్తులో మండలానికి కావాల్సిన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

'పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

కల్వకుర్తిటౌన్, జూలై 15 : అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని బచ్‌పన్ పాఠశాలవద్ద నిరసన తెలిపి మాట్లాడారు. పాఠశాల అనుమతి పొందిన పేరు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ అని.. స్కూల్ నడిపిస్తున్న పేరు వేరు అని, సీబీఎస్ఈ సిలబస్ లేకున్నా బోర్డులు ఏర్పాటుచేశారని వారు ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా స్కూలు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇలాంటి పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి బాసునాయక్‌ను కోరినట్లు విద్యార్థిసంఘం నాయకులు వివరించారు. విద్యార్థిసంఘం నాయకులు సంతోష్, లక్పతి, అర్జున్, నితిన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం ప్రారంభం

ఉప్పునుంతల, జూలై 15: నర్సరీ నుంచి యూకేజీ అంగన్‌వాడీ చిన్నారులను చదువుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం సోమవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బిపాషా మాట్లాడుతూ చిన్నారులు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు అంగన్‌వాడీలలోనే చిన్నారులు చదివేలా ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ నెల 20తేదీ వరకు అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం ఉంటుందన్నారు.

'గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి'

తిమ్మాజిపేట, జూలై 15 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలలో భాగంగా గృహజ్యోతి పథకం అమలు విషయంలో గ్రామాల్లో ప్రజలు అపోహలు వీడాలని జీరో బిల్లులు అందని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నేరేళ్లపల్లి మనోహర్ అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆయన సోమవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ ప్రకటించిన గ్యారంటీ పథకాలు అమలు చేయడం తథ్యమని, ప్రజాపాలన ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రజావాణిపై అధికారుల నిర్లక్ష్యం

చారకొండ, జూలై 15: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశాలున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు సక్రమంగా హాజరు కాకపోవడంతో మండలంలోని ప్రజలు, రైతులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి రాకుండా జిల్లా కేంద్రంలో నిర్వహి ంచే ప్రజావాణికి వెళ్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చారకొండలో నిర్వహించే ప్రజావాణికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ కేసీ ప్రమీల మాత్రమే హాజరయ్యారు. మిగతా ఏ శాఖల అధికారులు హాజరు కాలేదు.

● **ప్రజావాణికి దరఖాస్తులు నిల్**

తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి దరఖాస్తులు రాలేదని తహసీల్దార్ కేసీ ప్రమీల పేర్కొన్నారు. ప్రజావాణికి మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. మండలంలోని ప్రజలు, రైతులు ఏమైన సమస్యలుంటే నేరుగా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొంటే అయా శాఖల అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరిస్తారని అన్నారు.

'కార్డియాక్ మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

అమ్రాబాద్, జూలై 15: సీబీఎం చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ కేర్ హాస్పిటల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20న అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో నిర్వహించనున్న కార్డియాక్ మెగా వైద్య శిబిరాన్ని నల్లమల ప్రాంతంలోని అన్ని మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ కార్యదర్శి మద్దెల దివాకర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్డియాక్ మెగా వైద్య శిబిరంలో గుండె, న్యూరో, ఆర్థోపెడిక్ పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సీబీఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ, ఏరియా హాస్పిటల్ వైద్యనిపుణులతో పాటు, కేర్ ఆసుపత్రి వైద్యులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

చలో సచివాలయం ముట్టడికి వెళుతున్న నిరుద్యోగి అరెస్టు

ఉప్పునుంతల, జూలై 15 : గ్రూప్-2, 3 పోస్టుల పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, జాబ్ క్యాలెండర్ ఇవ్వాలని జనసభ పిలుపు మేరకు సోమవారం చలో సచివాలయం ముట్టడికి వెళుతున్న వెల్టూరు గ్రామానికి చెందిన ఉప్పరి బాల్‌రాజ్‌ను స్థానిక పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వదిలి పెట్టినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 15 : గంజాయి తరలిస్తుండగా వల పన్ని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. 48 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామ పరిసర ప్రాంతంలోని పెద్దగుట్ట దగ్గర మూడవ సంతోష్‌నాయక్, మేడముని గణేష్ గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం: కేసు నమోదు

కల్వకుర్తిటౌన్, జూలై 15 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన 23 సంవత్సరాల విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్ఐ మాధవరెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 11వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామంనుంచి వెళ్లిపోయిందని ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.